క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



ఫీల్డ్ అసిస్టెంట్‌ను పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని మరువాడ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ పొలం రామకృష్ణ ఇటీవల గాయపడటంతో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం, సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు, మరువాడ సర్పంచ్ ప్రతినిధి పిల్ల తాత, ఎంపీటీసీ ఉప్పాడ అప్పన్న, నాయకులు జక్కంపూడి గురువులు, కోటి, గోవిందాసు అప్పన్న కూడా పరామర్శించారు.

వ్యాధులపై అప్రమత్తం అవసరం

జి.సిగడాం: వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అనూష అన్నారు. మంగళవారం జాడ గ్రామంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు నిరంతరం అందుబాటులో ఉంటూ జ్వరాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు.

విజిలెన్స్ ఎస్పీని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ప్రసాదరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బర్ల ప్రసాదరావును శ్రీకాకుళం నగరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మండవల్లి రవి, అంధవరపు రమేష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా విజిలెన్స్ కార్యాలయంలో మంగళవారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ధర్మబద్ధంగా జీవించాలి



శ్రీనివాసరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో గీతాజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని భాగవద్గీత సప్తాహంలో భాగంగా మంగళవారం 'మాఫలేషు కథాచన ' అనే అంశంపై డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు ప్రసంగించారు. వృత్తి, వ్యాపారాలను ధర్మబద్ధంగా చేయాలని, ఫలితాన్ని ఆశించకూడదని భగవద్గీత తెలిపిందని పేర్కొన్నారు. సృష్టిలో ప్రతి జీవి భగవత్ స్వరూపమేనని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, ఇప్పిలి ప్రభాకరరావు, డాక్టర్ సుధాకర్, పతంజలి శాస్త్రి, కోమల రావు, నరసింహమూర్తి, ఉమారాణి, ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గార : పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వడం ద్వారా మనతో పాటు సమాజం ఆరోగ్యకరంగా ఉంటుందని సమన్వయకర్త కె.అమ్మాజీరావు అన్నారు. మంగళవారం కె.మత్స్యలేశం పంచాయతీలో ప్రపంచ మరుగుదొడ్ల వారోత్సవాల ముగింపులో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో శతశాతం మరుగుదొడ్లు నిర్మించినట్లు చెప్పారు. నిర్మాణమే కాకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలన పంచాయతీగా కృషిచేసిన సర్పంచ్ బి.లలిత కుమారిని ఈ సందర్భంగా స్థానికులు సన్మానించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బి.ఎర్రన్న, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, కె.సుధాకరరావు, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల గొడవపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు క్యాంపస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు గొడవపడ్డారు. బాయ్స్ కాంపస్‌కు చెందిన విద్యార్థి ఐఐటీ క్యాంపస్‌కు చెందిన విద్యార్థిపై చేయి చేసుకున్నట్లు ఎంఎల్‌సీ నమోదు కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ సంతోష్‌కుమార్ చెప్పారు.

గద్దర్ పురస్కారానికి వేణు ఎంపిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బహుజనుల చైతన్యం, హక్కుల కోసం పోరాడుతున్న డాక్టర్ కంఠ వేణు ప్రజా యుద్ధనౌక గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి ఎంపికయ్యారని నిర్వహణ కమిటీ సభ్యులు ఆతవ ఉదయభాస్కర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 12న డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో జరిగే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేస్తారని పేర్కొన్నారు.

'చెత్త'శుద్ధి కరువు!

- నిర్వహణకు దూరంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు
- నెరవేరని ఆశయం
- వెంటాడుతున్న నిధుల కొరత



కేశవరావుపేటలో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం



ఎస్ఎంపురంలో పొడి చెత్తను పిండి చేసే యంత్రాలు

ఎచ్చెర్ల క్యాంపస్: పల్లె ప్రగతిలో పారిశుద్ధ్య నిర్వహణ కీలకం. గ్రామాల్లో చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి. అయితే డంపింగ్ యార్డులకు స్థలం సమస్య. చెత్తపోగులుగా ఉండటం వల్ల అనర్థాలు, జనావాస ప్రాంతాల్లో ప్రజల నుంచి వ్యతిరేకత, ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవటం వంటి కారణాలతో ప్రభుత్వమే చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను తెరపైకి తీసుకొచ్చింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ షెడ్‌లు మంజూరు చేసింది. వీటి నిర్వహణ బాధ్యత పూర్తిగా పంచాయతీలదే. తడి చెత్త పొడిచెత్త వేరు చేయటం, తడి చెత్త ద్వారా ఎరువులు తయారు చేసి అమ్మటం, పొడి చెత్తను యంత్రాలతో పొడర్‌గా మార్చి అమ్మటం, రోడ్డు నిర్మాణ పనులు వంటి వాటికి వినియోగించడం చేయాలి. ప్రస్తుతం ఈ పనులేవీ జరగడకపోవడంతో సమున్నత ఆశయానికి తూట్లుపడుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

ఎచ్చెర్ల నియోజక వర్గంలో ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల్లో 123 గ్రామ పంచాయతీలు, 100 సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 98 చెత్త నుంచి సంపద తయారీ సృష్టించే కేంద్రాలు ఉన్నాయి. నిర్వహణలో మాత్రం 10 శాతం మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా చోట్ల నిర్వహణ కరువైంది. చెత్తతో నింపటం, పోగులను తగలపెట్టటం వంటి చర్యలకే పరిమితమవుతున్నాయి. ఎరువు తయారీ, ఇతర నిర్వహణకు నిధులు అవసరం కావడం, ఎరువులు, ప్లాస్టిక్ వ్యర్థాలు కొనుగోలుకు ఎవ్వరూ ముందుకు రాకపోవటం, కొన్ని పంచాయతీల నిర్వహనకు నిధుల కొరత వంటి సమస్యలు ఉన్నాయి. దీంతో ఈ కేంద్రాలు ఆశయానికి దూరంగా ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న దానికి, క్షేత్రస్థాయిలో నిర్వహణకు చాలా తేడా ఉంది. గతంలో మెరుగ్గా నిర్వహించిన వారు సైతం ప్రస్తుతం చేతులు ఎత్తేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కేంద్రాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నిధులు అవసరం



ప్రభుత్వం చెప్పిన దానికి క్షేత్రస్థాయిలో అమలుకు తేడా ఉంటోంది. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుద్ధ్యం కీలకం. డంపింగ్ యార్డ్‌ల వల్ల చెత్త పోగుగా మారుతుంది. చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు వినియోగం అత్యవసరం. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు ఇస్తేనే ఇది సాధ్యం.

– కె.తిరుపతిరావు, తోటపాలెం

ఆర్థిక భారం..



చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల నిర్వహణ ఆర్థిక భారంతో కూడుకున్నది. ఎరువులు కొనే వారు కరువయ్యారు. పెట్టుబడిలో 50 శాతం ఆదాయం రావడం లేదు. ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెడితేనే నిర్వహణ సాధ్యం. తడి చెత్త నుంచి ఎరువు తయారీ, పొడి వృథా మెటీరియల్ పొడర్ కోసం యంత్రాలు కొనుగోలు, విద్యుత్ బిల్లులు చాలా ఖర్చుతో కూడుకున్నవి.


– డి.వెంకటరమణ, చిలకపాలెం

నిర్వహణ పంచాయతీలదే..

చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల నిర్వహణ పంచాయతీలదే. ఆదాయం పొందేలా ఎరువు తయారు చేసి అమ్మాలి. గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్యంలో ఈ కేంద్రాల నిర్వహణ కీలకం.

– బి.మల్లేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎచ్చెర్ల

పొంచి ఉన్న ప్రమాదం



జి.సిగడాం మండలం ఆనందపురం గ్రామంలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంక్ పెచ్చులూడుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలోనే విద్యార్థులు, చిన్నారులు తిరుగుతుంటారు. దీంతో ట్యాంకు వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. అధికారులు స్పందించి ట్యాంకును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– జి.సిగడాం

రిమ్స్ రోడ్డే పార్కింగ్ స్థలం



నిత్యం వేలాది మంది రోగులు, సహాయకుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్) రోడ్డుపై కొందరు నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రి వంటి నిర్మాణాలు చేపట్టినా పార్కింగ్ స్థలం లేకపోవడంతో వారి వాహనాలను రోడ్డు పైనే పార్కింగ్ చేస్తుండటంతో రహదారి ఇరుకుగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వాహనాలు నిలిపివేయకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ



ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్ష యోజనలో భాగంగా 39 మంది గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. జెమ్స్ ఆస్పత్రి నుంచి ప్రత్యేకంగా స్కానింగ్ యంత్రం తీసుకొచ్చి వైద్య పరీక్షలు చేపట్టారు. స్థానిక వైద్యురాలు మాడుగుల ఉషశ్రీ, జెమ్స్ వైద్యురాలు డయోనా మాట్లాడుతూ ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలకు హాజరు కావాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, ఆస్పత్రిలోనే డెలివరీ చేయించుకోవాలని సూచించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేద్దాం



అభినందన సభలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పనిచేస్తున్నానని, తనమీదున్న నమ్మకంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన రాష్ట్రస్థాయి పదవిని బాధ్యతగా నిర్వర్తిస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కిల్లి వెంకట సత్యనారాయణ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో మంగళవారం నిర్వహించిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో వైఎస్సార్ సీపీని మరింతగా అభివృద్ధి చేద్దామన్నారు. తనకు పదవి రావడంలో సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలు గాలికొదిలేసి ప్రశ్నించేవారిపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేంటి? ప్రస్తుతం చేస్తున్న పాలనేంటని ప్రశ్నించారు. పరిపాలించడం చేతకాక అర్హులైనవారి పెన్షన్లు, సంక్షేమ పథకాలు తీసేసి మంత్రి అచ్చెన్న, ఆయన అనుచరులు ఆనందం పొందుతున్నారన్నారు. ఇలాంటి పాలన అందిస్తే ప్రజలు హర్షించరన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మాట్లాడుతూ చిరుద్యోగులపై టీడీపీ నేతలు ప్రతాపం చూపిస్తున్నారన్నారు. అందరం కలిసి నియోజకవర్గ సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. ఏ పథకం ఇచ్చినా చంద్రబాబు ఏడుస్తూ ఇస్తారన్నారు. త్వరలో జమిలి ఎన్నికలు వస్తాయని, మీలా మేం చేస్తే పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు హితవు పలికారు. కార్యక్రమంలో ఆమదాలవలస ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రొతు శంకరరావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణ, మాజీ డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, అంబటి శ్రీనివాసరావు, బూర్జ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, ఎన్ని ధనుంజయరావు, గేదెల పురుషోత్తం, కె.వి.వి.సత్యనారాయణ, కోట గోవిందరావు, రఘురాం, పీస గోపి, సనపల నారాయణరావు, పిన్నింటి సాయి, బూర్లె శ్రీనివాసరావు, చింతు రామారావు, సరుబుజ్జిలి మండల నాయకులు, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, లావేటి అనిల్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రవణ, పైడి నర్సింహ అప్పారావు, ఆమదాలవలస మండల పార్టీ కన్వీనర్ తమ్మినేని శ్రీరామ్మూర్తి, బూర్జ మండల నాయకులు కర్నేన నాగేశ్వరరావు, పొందూరు జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పప్పల రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బైక్ దొంగలు అరెస్టు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : నాలుగు ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులు మంగళవారం పోలీసులకు పట్టుబడ్డారు. శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ మెడికవర్ ఆస్పత్రి సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామానికి చెందిన వాకాడ సూర్యనారాయణ, వాకాడ గణేష్‌రెడ్డిలు పట్టుబడ్డారు. వీరి వద్ద నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించనట్లు సీఐ ఈశ్వరరావు తెలిపారు.శ్రీకాకుళం టూటౌన్ పరిధిలో రెండు, విశాఖపట్నం సిటీ, రణస్థలం వద్ద ఒక్కొక్క బైకును వీరు దొంగిలించినట్లు సీఐ చెప్పారు.

ఆరోగ్యం ప్రాథమిక హక్కు



ఫ్యామిలీ కార్డును ఆవిష్కరిస్తున్న కమిషనర్, ఆస్పత్రి ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆరోగ్యం ప్రతి ఒక్కరికి ప్రాథమిక హక్కు అని శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి. ప్రసాదరావు అన్నారు. నగరంలోని మెడికవర్ హాస్పిటల్స్‌లో మంగళవారం మెడికవర్ ఫ్యామిలీ కార్డును కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ డాక్టర్ సాగరిక మాట్లాడుతూ కార్డు గరిష్ఠంగా నలుగురు డిపెండెంట్లకు కవర్ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ సుధీర్, ఆపరేషన్స్ హెడ్ శివ, మేనేజర్ దిలీప్ పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోషల్ ఆడిట్ సభ్యులు మంగళవారం రికార్డులు పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీవో శోభాదేవి మండలానికి సంబంధించి రికార్డులను అందజేశారు. వీటిని పరిశీలించిన సోషల్ ఆడిట్ బందాలు ఈ నెల 22 వరకు క్షేత్ర స్థాయి పరిశీలన చేయనున్నట్లు చెప్పారు. ఉపాధి పనులు, మెటీరియల్ కాంపొనెంట్ పనులకు సంబంధించి ఈ ఏడాది రూ.31.71 కోట్లు ఖర్చు చేశారని, 1971 పనులు చేశారని, 17238 మందికి ఉపాధి కల్పించారని వివరించారు.

వసతి గృహాల తనిఖీ



పెచ్చులూడిన పైకప్పును పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

రణస్థలం: వసతి గృహాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అందించే పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. రణస్థలం బీసీ బాలుర వసతి గృహం, బీసీ బాలికల కళాశాల వసతి గృహాలను మంగళవారం తనిఖీ చేశారు. వంట గదులు, విద్యార్థుల గదులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. మెనూ అమలుపై ఆరా తీశారు. బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతుండటంతో ఎందుకు మరమ్మతులు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో వార్డెన్లు బి.మీనాక్షి, సీహెచ్ ప్రవీణ, సిబ్బంది పాల్గొన్నారు.

16న చలో రణస్థలం



పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు

రణస్థలం :ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణను వ్యతిరేకిస్తూ 'ఛలో రణస్థలం' పేరిట ఈ నెల 16న రణస్థలంలో భారీ ర్యాలీ, మాల ఉపకులాలల మహాసభ నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రణస్థలంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ టొంపల సీతారాం, ఎస్సీ సంఘ నాయకులు ముక్కు ఆదినారాయణ, సింక అప్పారావు, దండాసి జాను, నేతల కృష్ణ, తాలాడ రమణ, యామల కృష్ణ, ఒమ్మి రవి తదితరులు పాల్గొన్నారు.

కవితా సంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సాధన, శోధన కవుల ప్రధాన లక్షణాలని, అవి పుష్కలంగా ఉన్న ఉదయ్‌కిరణ్ మంచి కవిగా ఎదుగుతారని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉదయ్‌కిరణ్ రచించిన కవితా సంపుటి 'ఖాకీ చొక్కా' పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సంఘటనల పట్ల స్పందించడమే కవిత్వమని, ఆ స్పందనకు అక్షర రూపమిచ్చి కవితా సంపుటిగా వెలువరించడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థకార్యదర్శి బుర్రికుమార రాజు, కంచరాన భుజంగరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి, తంగి ఎర్రమ్మ, కుప్పిలి వెంకట రాజారావు, రొతు ధనలక్ష్మీ, బాడాన శ్యామలరావు, నెట్టిమి రమణ, డి.రామకృష్ణ, సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు, యూనివర్సిటీ అధ్యాపకులు లీలా ప్రసాద్, గాయకులు అంబేడ్కర్, చింతాడ రామచంద్రరావు, శ్రీనివాసులు, ఎం.ప్రభాకరరావు, పి.సుధాకర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



ఆదివారంపేటలో క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న ఆరాధకులు

శ్రీకాకుళం కల్చరల్ :

నగరంలోని ఆదివారంపేటలో కల్వరి ప్రేయర్ టెంపుల్ ఆధ్వర్యంలో మంగళవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ చల్లా విజయ్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రిస్మస్ గీతాలాపనలు, కేక్ కటింగ్, క్యాండిల్ లైట్ సర్వీస్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్ చల్లా కరుణాకర్, కె.సూర్యనారాయణ, ఎస్తేరు రాణి, కొర్నేలి, భార్గవ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు. పాత శ్రీకాకుళంలోని కలెక్టర్ కార్యాలయం రోడ్డులో ఉన్న ఆంధ్రా బాప్టిస్టు చర్చిలో ఎలోహిమ్ గాస్పెల్, ప్రేయర్ టీమ్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. రెవ.మేజస్, పాస్టర్ ఎన్ సురేష్ ఐజాక్ దైవ సందేశం వినిపించారు. కార్యక్రమంలో బిషప్ పి.జాషువా, మండ ఎలీషా, రమణ మాస్టర్, ఉమా, సురేష్, శ్యామ్‌కుమార్, ఎలిజిబెత్, దైవసేవకులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి



మాట్లాడుతున్న రమణమూర్తినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్:

మహిళా ఉద్యోగులు, విద్యార్థినులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు అన్నారు. కళాశాలలో మంగళవారం లైంగిక వేధింపులు-నివారణ, పోక్సో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎటువంటి సమస్యలున్నా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతి మహిళా ఉద్యోగి చట్టాలు తెలుసుకోవాలని, సమస్య ఎదురైతే ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రీవెన్స్ కన్వీనర్ జి.మన్మధలీల, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలు నిలిపివేయాలి



ఆందోళన చేపడుతున్న సంచాం గ్రామస్తులు

రణస్థలం: మండలంలోని సంచాం కొండపై జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలంటూ గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రెండు రోజులు జరుగుతున్న తవ్వకాలపై ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు సరిహద్దు నిర్ణయించే వరకు తవ్వకాలు జరపరాదని అనుమతి పొందిన వ్యక్తులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అయినా రాత్రి వేళల్లో తవ్వకాలు జరపడంతో మంగళవారం ఉదయం సంచాం కొండ వద్దకు చేరుకున్న గ్రామస్తులు నిరసన చేపట్టారు. తక్షణమే పొక్లెయినర్, ఇతర సామగ్రిని తరలించుకుపోవాలని టెంట్ వేసి ఆందోళనకు దిగారు. ఎస్సీలకు డీపట్టాలు మంజూరు చేసిన భూముల్లో రోడ్లు వేసి తవ్వకాలు జరిపి గ్రావెల్ తరలించడం తగదన్నారు.

ముగిసిన పింఛన్ల తనిఖీ



సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం పంచాయతీలో నిర్వహిస్తున్న సామాజిక పింఛన్ల తనిఖీ మంగళవారంతో ముగిసింది. సోమ, మంగళవారాల్లో లావేరు సచివాలయ ఉద్యోగులు పైలట్ గ్రామంగా ఇక్కడ సర్వే చేపట్టారు. సంతసీతారాంపురం, నందివాడ, బలిజిపేట, చినరావుపల్లి గ్రామాల్లో వివిధ కేటగిరీల కింద 425 పింఛన్లు ఉన్నాయి. అందులో 27 మంది అందుబాటులో లేరు. 398 మంది పింఛన్లు తనిఖీ చేశారు. కేటగిరి, అర్హత, ఎప్పటి నుంచి వస్తుంది, కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఇది కేవలం సర్వే మాత్రమేనని, ఎటువంటి అనర్హత గుర్తింపు, తొలగింపు ఉండవని ఎంపీడీవో సీపాన హరిహరరావు చెప్పారు.